క్లుప్తంగా

బసవేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి సహకరించండి



బాన్సువాడ రూరల్: బోర్లంక్యాంపులో పురాతన మొండి బసవేశ్వర ఆలయం శిథిలావస్థకు చేరడంతో ఆలయ పునర్నిర్మాణానికి గ్రామస్తులు ముందుకు వచ్చారు. సుమారు రూ.20 లక్షల అంచనా వ్యయంతో ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. దాతలు ఐరన్, సిమెంట్, కంకర తదితర సామగ్రి ఇప్పిస్తే ఆలయ పనులు సులువవుతాయని గ్రామస్తులు తెలిపారు. దాతలు ముందు వచ్చి విరాళాలు అందించాలని కోరగా.. కమిటీ సభ్యులు ముందుగా రూ.5 వేల చొప్పున విరాళం అందించారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు సంగం శ్రీనివాస్‌రెడ్డి, రాందీన్‌సుభాష్, ఆనంద్, శ్రీశైలం, సంజీవ్‌రెడ్డి, కొండ నగేష్, శ్రీధర్ పంతులు తదితరులు పాల్గొన్నారు. దాతలు 99083 09939, 99491 94978కు సంప్రదించాలన్నారు.

కాంపౌండ్ వాల్ నిర్మించాలి



ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కాంపౌండ్ వాల్ నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు. కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో పశువులు, మేకలు వస్తున్నాయని, కళాశాల ఆవరణలో నాటిన మొక్కలను తినేస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. ప్రహరీ ఏర్పాటు వల్ల ఇబ్బందులు తొలగడంతో పాటు విద్యార్థులు సైతం బయటకు తిరగకుండా ఉంటారని అధ్యాపకులు అంటున్నారు.

మాల సంఘం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని వినతి



బాన్సువాడ: అన్ని జిల్లాల్లో మాల సంఘం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి ఆదివారం మాల సంఘం తెలంగాణ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో మాల సంఘం కార్పొరేషన్లు ఏర్పాటు చేసి మాలల అభివృద్ధి కోసం కృషి చేయాలని అన్నారు. మాల సంఘం డివిజన్ అధ్యక్షుడు సాయన్న, నాయకులు గడ్డమీది సాయిలు, సురేష్, పాండు, గంగాధర్, భూమేష్, రాములు, సైదయ్య, జ్యోతిపాల్ తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో పోలీసులు ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు హెల్మెట్ ధరించి నడపాలని అన్నారు. ఇన్సూరెన్సు చేయించుకోవాలని, ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని ఎస్సై మహేష్ వాహనదారులకు సూచించారు. పెండింగ్ చలాన్లు చెల్లించాలని అన్నారు.

అధికారుల పేర్లు ఎక్కడ?



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారుల పేర్లు, ఫోన్ నెంబర్లతో కూడిన వివరాలు బోర్డులపై రాస్తారు. మద్నూర్ మండల కేంద్రంలోని పశువైద్యశాల గోడకు అధికారుల, వైద్యుల పేర్లను తెలిపే బోర్డు ఖాళీగా మారింది. ఎన్నో ఏళ్లుగా బోర్డుపై అధికారుల వివరాలు రాయకపోవడంతో ప్రజలకు సమాచారం అందడం లేదు.

రాశి వనం కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలోని రాశివనం సుందరీకరణ, అభివృద్ధి కోసం రెండేళ్ల కాల పరిమితితో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా న్యాయవాది కె.శ్యాంగోపాల్‌రావు, కార్యదర్శిగా నర్సింలు, కోశాధికారిగా సోమిశెట్టి ఆంజనేయులు ఎన్నికయ్యారు. కళాశాల అధ్యాపకుడు ఆకుల సుధాకర్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు.

పద్మశాలి కార్యవర్గం ఎన్నిక

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఆర్యసమాజ్ మందిరంలో ఆదివారం పద్మశాలి సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశంలో పట్టణ, మండల పద్మశాలి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా హన్మాండ్లు, కార్యదర్శిగా అరవింద్‌ను .. మండల అధ్యక్షుడిగా బాలరాజు, ఉపాధ్యక్షునిగా పండరిలతో పాటు సంఘం కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రారంభానికి నోచుకోని జీపీ భవనాలు



లింగంపల్లిలో పూర్తయిన జీపీ భవనం



విఠల్‌వాడిలో నిర్మాణం పూర్తయి పెయింటింగ్ దశలో ఉన్న భవనం



పోచారం తండా జీపీ భవనం వద్ద మందుబాటిళ్లు

- లింగంపల్లి, పోచారం తండా గ్రామాల్లో పూర్తయిన నిర్మాణాలు
- విఠల్‌వాడిలో 90 శాతం పనులు పూర్తి
- ఇప్పటికీ పాఠశాలల్లోనే కొనసాగుతున్న జీపీ కార్యకలాపాలు
- ఇరుకు గదులతో ఇటు విద్యార్థులు.. అటు ప్రజలు ఇబ్బందులు పడుతున్న వైనం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. మండలంలోని లింగంపల్లి, విఠల్‌వాడి, పోచారం తండాలలో రూ.20 లక్షల వ్యయంతో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం చేపట్టారు. వాటిలో లింగంపల్లి జీపీ భవన నిర్మాణం రెండేళ్ల క్రితమే పూర్తవగా.. పోచారం తండాలో ఇటీవల పూర్తయింది. విఠల్‌వాడ గ్రామ పంచాయతీ భవన నిర్మాణం 90 శాతం పూర్తయింది. చిన్న చిన్న పనులు మిగిలి ఉన్నాయి. వాటిని త్వరగా ప్రారంభించకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారిపోయాయి. భవనం ఆవరణలో తాగిపడేసిన మందుబాటిళ్లు దర్శనమిస్తున్నాయి. విఠల్‌వాడి గ్రామ పాఠశాలలో ఐదవ తరగతి వరకు ఉంది. పాఠశాలలో మూడు గదులు మాత్రమే ఉన్నాయి. అందులో ఒక్కటి గ్రామ పంచాయతీ పనులకు ఉపయోగించడంతో విద్యార్థులకు రెండు గదులు మాత్రమే మిగిలాయి. ఇరుకు గదులతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అలాగే లింగంపల్లి గ్రామ పంచాయతీ భవనం కూడా ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతోంది. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికే పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన పంచాయతీ భవనాలు త్వరగా ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం

పోచారంతండా, లింగంపల్లి, విఠల్ వాడి పంచాయతీలకు రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి. త్వరలో ప్రారంభోత్సవం జరుగుతుంది.

– శ్రీకాంత్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మండల అధికారి, పెద్దకొడప్‌గల్

నేడు అచ్చాయపల్లి జీపీ భవన ప్రారంభోత్సవం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): అచ్చాయపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని సోమవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ తెలిపారు. దీంతోపాటు పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి అచ్చాయపల్లిమీదుగా ఎర్రారం వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం ఎమ్మెల్యే శంకుస్థాపన చేస్తారని చెప్పారు.

ఐదు నెలలుగా అందని వేతనాలు

- ఇబ్బందులు పడుతున్న సానిటేషన్ సిబ్బంది

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేసే సానిటేషన్ సిబ్బందికి ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో సానిటేషన్, సెక్యూరిటీ గార్డు, పేషెంట్ కేర్‌కు సంబంధించిన ఉద్యోగులు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్నారు. వీరికి పీఎఫ్, ఇతర కటింగ్‌లు పోను ప్రతి నెలా రూ.11 వేల వేతనం అందిస్తారు. ప్రభుత్వం నుంచి ప్రతి నెలా వేతనం రాని పక్షంలో ఏజెన్సీ కాంట్రాక్టర్ సిబ్బందికి వేతనాలు ఇవ్వాల్సి ఉంటుంది కాని అటు ప్రభుత్వం నుంచి వేతనాలు అందక ఇటు ఏజెన్సీ వారు వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబం గడవడానికి ఇబ్బందిగా ఉందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తమ వేతనాలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ ప్రజావాణి

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని విద్యుత్ శాఖ డీఈ కార్యాలయంలో సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈ విజయసారథి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదులు అందించాలని అన్నారు.

ఎల్లారెడ్డికి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు రాక

ఎల్లారెడ్డి: మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు సోమవారం రానున్నట్లు కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పలు గ్రామాలలో సీసీ రోడ్లు, బీటీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు వారు తెలిపారు.

బ్రాహ్మణపల్లిలో గ్రామ సభ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బ్రాహ్మణపల్లిలో సోమవారం గ్రామ సభను నిర్వహించనున్నట్లు గ్రామ ప్రత్యేక అధికారి నర్సిములు, గ్రామ కార్యదర్శి వీరేశం తెలిపారు. ఉపాధిహామీ సామాజిక తనిఖీ కార్యక్రమంలో భాగంగా ఈ గ్రామసభను జరుపుతున్నామన్నారు. గ్రామసభ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలియజేశారు.

వాచ్‌మన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట: మండల కేంద్రంలోని కేజీబీవీలో నైట్ వాచ్‌మన్ కోసం మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆదివారం పాఠశాల ప్రత్యేక అధికారి శ్రీవాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మంగళవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తుల స్వీకరించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. రాజంపేట మండలానికి చెందిన మహిళా అభ్యర్థులై ఉండి 10వ తరగతి ఉత్తీర్ణత పొంది పని అనుభవం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు



ఎమ్మెల్యే సమక్షంలో చేరుతున్న బీఆర్ఎస్ నేతలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెంగారం, బూరుగిద్ద, లింగంపేటతో పాటు పలు గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. లింగంపేటకు చెందిన మున్నూరుకాపు మండల అధ్యక్షుడు గుండ బాలకిషన్, ఉపాధ్యక్షుడు కడారి రమేశ్, వార్డు మెంబర్లు బెస్త సాయిలు, మంగళి రమేశ్, నాగయ్య, మెంగారం గ్రామానికి చెందిన రాకేష్‌గౌడ్, రాజాగౌడ్, గంగయ్య, బాలపోచయ్య, విఠల్, బూరుగిద్ద గ్రామానికి చెందిన ఆంటోనితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులమై కాంగ్రెస్‌లో చేరినట్లు ప్రకటించారు. మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, ఎల్లమయ్య, అశోక్, బైరయ్య తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడికి ఘన స్వాగతం



మహేశ్‌కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి

భిక్కనూరు: హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు వెళ్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు భిక్కనూరు మండల కేంద్రం వద్ద జాతీయ రహదారిపై కార్యకర్తలు నేతలు ఆదివారం ఘన స్వాగతం పలికారు. పూలమాలలతో శాలువాలతో సత్కరించారు.కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, నేతలు అంకం రాజు, నర్సింహారెడ్డి, స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

షబ్బీర్ అలీ నివాసానికి మహేశ్



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ నివాసానికి పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆదివారం వచ్చారు. నిజామాబాద్ వెళ్తుండగా మార్గమధ్యలో షబ్బీర్ అలీ నివాసంలో అల్పాహారం చేశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. జిల్లా పార్టీ ముఖ్య నాయకులతో కాసేపు ముచ్చటించారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, తదితరులున్నారు.

సంఘటన్ ఆలిండియా అధ్యక్షుడికి..

భిక్కనూరు: రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ ఆలిండియా అధ్యక్షుడు సునీల్ పన్వార్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి ఆదివారం సన్మానించారు. ఆదివారం గాంధీ భవన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న సునీల్ సన్వార్‌ను కలిసి సన్మానించారు. అలాగే తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కూడా సత్కరించారు. కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, నేతలు అంకం రాజు, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శికి..

కామారెడ్డి టౌన్: టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమితులైన గడ్డం చంద్రశేఖర్‌రెడ్డిని కామారెడ్డి రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపికను అందజేశారు. రజక సంఘం అధ్యక్షుడు మహేష్, ఉపాధ్యక్షుడు రాజు, కార్యదర్శి నరేష్, నాయకులు నర్సయ్య, స్వామి, వెంకటేష్ తదితరులున్నారు.

కష్టపడ్డ వారికే పదవులివ్వాలి



పీసీసీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న సందీప్

కామారెడ్డి టౌన్: పార్టీ కోసం కష్టపడ్డ నాయకులకే పదవులివ్వాలని పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు ఐరేని సందీప్ కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ నివాసంలో ఆయన కలిసి శాలువాతో సత్కరించారు. కొత్తగా వచ్చి లాబీయింగ్ చేసే వారికి కాకుండా మొదటి నుంచి పార్టీ జెండా మోసిన వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లలో నిరుపేద కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వినతిపత్రాన్ని అందజేశారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న వినయ్‌కుమార్

కామారెడ్డి టౌన్: జిల్లాలో నిబంధనలు పాటించకుండా కొనసాగుతున్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు కొత్మీర్‌కర్ వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ, స్కూళ్లలో బ్యాగులు, పుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తున్న వాటిపై దాడులు జరపాలని విద్యాశాఖ అధికారులకు డిమాండ్ చేశారు. నాయకులు మధు, అమన్, శ్రీనివాస్, కరణ్, శ్రీకాంత్ తదితరులున్నారు.

సంక్షిప్తం

వర్షాలు కురియాలని ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): వర్షాలు కురియాలని కోరుతూ కన్‌కల్‌లో ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. కప్పను కర్రలకు కట్టి గ్రామంలో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. అనంతరంగా గ్రామ శివారులో గల గ్రామ దేవతలకు పూజలు చేశారు.

ఘనంగా ఎల్లమ్మ తల్లి బోనాల పండుగ

పిట్లం(జుక్కల్):గౌరారంలో ఆషాడ మాసం సందర్భంగా ఎల్లమ్మ తల్లికి బోనాలతో ఊరేగింపు వెళ్లి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో గ్రామపెద్దలుతదితరులు పాల్గొన్నారు.

మార్కండేయ ఆలయంలో పదహారు రోజుల పండుగ



కామారెడ్డి అర్బన్: స్థానిక సిరిసిల్ల రోడ్డులోని శ్రీభక్త మార్కండేయ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన, శివపార్వతుల కల్యాణం ఉత్సవాల అనంతరం ఆదివారం 16 రోజుల పండుగ నిర్వహించారు. పెళ్లి తర్వాత నిర్వహించే పదహారు పండుగకు ఎంతో విశిష్టత ఉంటుందని వేదపండితులు గంగవరం అంజనేయశర్మ అన్నారు. పట్టణ పద్మశాలి సంఘం ప్రతినిధులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆకట్టుకున్న బోనాల ఉత్సవం

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని తెల్గాపూర్‌లో ఆదివారం పెద్దమ్మ తల్లి బోనాలు ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం జరిపారు. ముదిరాజ్ కుటుంబ సభ్యులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించు కున్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో రచ్చబండ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కన్‌కల్‌లో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రావు, శక్తి కేంద్రం ఇన్‌చార్జి రవీందర్‌రెడ్డి, బూత్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, రనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల శ్రమదానం

మాచారెడ్డి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన 'మన బడి' సభ్యులు శ్రమదానం చేశారు. పాఠశాల ఆవరణ, టాయిలెట్ల వద్ద పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. మనబడి కమిటీ అధ్యక్షుడు ప్రభాకర్, సభ్యులు దేవోళ్ల రాజు, పుట్టకుక్కల అంజయ్య, అంబటి నారాయణ, రాగుల దేవరాజు, షాబుద్దీన్, దేవోళ్ల కిరణ్, ఆరిఫ్, దారబోయిన సతీష్, రాగుల వెంకటేష్, సంతోష్‌రెడ్డి, జహీర్ పాల్గొన్నారు.

నేటి చిత్రం



రామారెడ్డిలో జరుగుతున్న వారాంతపు సంత

సంతలో వసతులు కల్పించండి

రామారెడ్డి: మండల కేంద్రంలో నిర్వహించే వారాంతపు సంతకు ప్రజలతో పాటు వర్తక వ్యాపారులు పెద్ద ఎత్తున వస్తారు. కనీసం నీటి వసతి కూడా కల్పించడం లేదు. అధికారులు స్పందించి వారాంతపు సంతలో వసతులు కల్పించాలి.

– రాజయ్య, రామారెడ్డి

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200
ఎల్లారెడ్డి : 97053 46576
బాన్సువాడ : 94402 11363
జుక్కల్ : 97053 46578

కొత్త స్తంభాలను అమర్చారు

సాక్షి ఎఫెక్ట్..



బాన్సువాడ రూరల్: సమయం లేదు..కొత్త స్తంభాలను అమర్చండి శీర్షికన ఈనెల 16న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. ఇటీవల ఈదురు గాలులతో కూడిన వర్షంతో కోనాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పంటపొలాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అలాగే జక్కల్‌దాని తండాలోనూ స్తంభాలు పడిపోయాయి. దీంతో స్పందించిన ట్రాన్స్‌కో రూరల్ ఏఈ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో కూలిన స్తంభాల స్థానంలో కొత్తవాటిని అమర్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వర్షాకాలం నాట్ల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో తమ సమస్యను పత్రికలో ప్రచురించడంతో, పరిష్కారం లభించిందని ఈప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేశారు.

వానరాలు పెట్టించిన ఖర్చు రూ.2 లక్షలు



రామారెడ్డిలో ఇంటిపై రేకులను అమర్చుతూ..

రామారెడ్డి: ఓ వ్యక్తికి ఓ వానరాలు పెట్టించిన ఖర్చు అక్షరాలా రూ.2 లక్షల అయింది. ఇదెలా అంటారా? గ్రామాల్లో చేరిన వానరమూకలు ఒక్కసారిగా పెంకుటిళ్లపై పడి గూన పెంకులను చిందరవందర చేస్తున్నాయి. వర్షం పడితే ఇంట్లో ఉండలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఈ పరిస్థితులను గమనించిన రామారెడ్డికి చెందిన బాలయ్య అనే వ్యక్తి ఇంటిపై రేకులను ఫీట్‌కు రూ.120 చొప్పున 1,620 ఫీట్లకు అన్ని ఖర్చులతో కలిపి రూ.2 లక్షలు పెట్టి వేయించుకున్నాడు. మండలంలోని పెంకుటిళ్లు ఉన్నవాళ్లు ప్రతి ఏడాది గూన పెంకులను సరి చేయడానికి రూ.20 వేల నుంచి 30 వేల ఖర్చు అవుతుండడంతో దీన్ని భరించలేక ఒకేసారి రేకులు ఏర్పాటు చేసుకుంటున్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



తాడ్కోల్‌లో నర్సరీ గేట్‌ను అల్లుకున్న తీగలు

బాన్సువాడ రూరల్: ఇక్కడున్న గేట్‌ను చూస్తుంటే అధికారులు పార్కు గేట్‌ను హరితహారంలో భాగంగా బహు చక్కగా అలంకరించారు అని అనుకుంటున్నారా..? అయితే మీరు తప్పులో కాలేసినట్లే. బాన్సువాడ మండలం తాడ్కోల్‌లో వనమహోత్సవం కోసం ఏర్పాటు చేసిన నర్సరీలో గేట్‌ను పిచ్చిమొక్కలు ఇలా పిచ్చిపిచ్చిగా అల్లుకున్నాయి. అయినా వాటిని గ్రామ క్షేత్ర సహాయకుడు గానీ నర్సరీ పరిశీలనకు తరచూ వచ్చే టీఏ, ఏపీవోలు కాని గమనించకపోవడం గమనర్హం. నర్సరీ గేట్‌ను బట్టి ఉపాధిహామీ అధికారులకు అక్కడ పెరుగుతున్న మొక్కలపై, వనమహోత్సవంపై ఏమాత్రం శ్రద్ధ ఉందో అర్థమవుతోంది.

పీహెచ్‌సీ ఆవరణలో శ్రమదానం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణలో ఆదివారం వైద్య సిబ్బంది శ్రమదానం చేశారు. శనివారం జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన సందర్భంగా పీహెచ్‌సీ ఆవరణలో చెత్తా చెదారం, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో సిబ్బంది పిచ్చి మొక్కలను తొలగించారు. అలాగే పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం, పిచ్చి మొక్కలను ట్రాక్టర్ సహాయంతో తొలగించారు.

కంకర తేలి.. అధ్వానంగా మారి..



నస్రుల్లాబాద్: సంగం గ్రామంలో గల క్రింది తండా ప్రాంతంలో సీసీ రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డు వేసి దశాబ్దాలు గడుస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ద్విచక్ర వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారని అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నూతన రోడ్డు వేయించాలని స్థానికులు కోరుతున్నారు.



జింకల గుంపు.. పొలాల్లో కనువిందు

మద్నూర్(జుక్కల్): వర్షాకాలం ప్రారంభమవడంతో పొలాల్లో జింకలు కనువిందు చేస్తున్నాయి. వాతావరణం పూర్తిగా చల్లబడడంతో మద్నూర్ సమీపంలో జాతీయ రహదారి పక్కన పొలాల్లో గురువారం ఓ జింకల గుంపు గెంతుతూ, పరిగెత్తుతూ జంతు ప్రేమికులను ఆకట్టుకున్నాయి.